
ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు

# బృహత్ కారిడార్ @ ఇబ్రహీంపట్నం

- హైదరాబాద్ నగరం, ఓఆర్ఆర్‌కు సమీపంలో ఉండడం కలిసొచ్చే అంశం
- హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో 3700 ఎకరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- శరవేగంగా సాగుతున్న భూసేకరణ పనులు
- గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- అత్యాధునిక హంగుల్లో వసతులు, పరిశ్రమల స్థాపన, ఐటీ సెక్టార్లు
- స్థానికంగా మెరుగుకానున్న ఉపాధి, ఉద్యోగావకాశాలు
- పెరుగనున్న భూముల ధరలు.. స్థలాలిచ్చేందుకు ముందుకొస్తున్న రైతులు
- ఈ కారిడార్ నిర్మాణం పూర్తైతే.. మరో హైటెక్ సిటీ, నానక్‌రాంగూడ తరహాలో మారనున్న 'పట్నం' రూపురేఖలు

ఇబ్రహీంపట్నం, మే 7 : రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో బృహత్ కారిడార్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ ప్రాంతం నగరానికి సమీపంలో ఉండడంతోపాటు ఔటర్‌రింగ్‌రోడ్డుకూ అతి దగ్గరలో ఉన్నది. దీంతో ఇబ్రహీంపట్నాన్ని మరింత అభివృద్ధి చేయాలని హెచ్ఎండీఏ సంకల్పించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును సుందరీకరించడంతోపాటు చెరువులో బోటు షికారు, కాటేజీల నిర్మాణం వంటివి చేపట్టేందుకు రూ.11 కోట్లను కేటాయించింది. చెరువు సుందరీకరణతోపాటు పరిసర ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం హైటెక్ సిటీ, నానక్‌రాంగూడ తరహాలో రూపుదిద్దుకునే అవకాశముందని హెచ్ఎండీఏ అధికారులు భావించి ఈ పనులను చేపడుతున్నారు.

### భూసేకరణ కోసం ..

బృహత్ కారిడార్‌లో భాగంగా పెద్దచెరువు పరిసర గ్రామాలైన ఇబ్రహీంపట్నం బగాయత్, ఇబ్రహీంపట్నం ఖల్సా, ఉప్పరిగూడ, పోచారం, కప్పాడు, చర్లపటేల్‌గూడ గ్రామాల్లో సుమారు 300 సర్వే నంబర్లలోని 3700 ఎకరాల పట్టా, అసైన్డ్ భూములను సేకరించాలని అధికారులు నిర్ణయించారు. ఈ భూముల్లో అత్యాధునిక హంగులతో వసతులు కల్పించనున్నారు. కొంతభాగంలో వెంచర్లు, మరి కొంత భాగంలో ఐటీ సెక్టార్లు, మిగిలిన భాగంలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. రైతుల నుంచి సేకరించిన పట్టా భూములకు ఎకరానికి 1740 గజాలు, అసైన్డ్ భూములకు ఎకరానికి 600 గజాల చొప్పున స్థలాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. ఈ భూముల్లో ఐటీ పరిశ్రమలు, బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలిస్తే రైతుల భూములకు కూడా మంచి ధరలు వచ్చే అవకాశాలున్నాయి. ఈ విషయాలన్నింటినీ రైతులకు వివరించి, ఒప్పించే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందుకోసం హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఆరు బృందాలను ఏర్పాటు చేయగా.. ఆ బృందాల్లోని సభ్యులు ఆయా గ్రామాల్లో రైతులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి తాము చేపట్టబోయే కార్యక్రమాలను వివరిస్తున్నారు.

### పెట్టుబడి లేకుండా.. సంపద సృష్టించడమే ధ్యేయం..

పెట్టుబడి లేకుండా సంపద సృష్టించాలన్న ఉద్దేశంతో బృహత్ కారిడార్ ఏర్పాటుకు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద హెచ్ఎండీఏకు సంపద రావడంతోపాటు రైతుల భూములకూ ధరలు పెరుగనున్నాయి. మరోవైపు ఈ ప్రాంతంలో ఏర్పాటు కానున్న ఐటీ కారిడార్లలో వెలియనున్న వివిధ సంస్థలు, పరిశ్రమలతో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు కానున్నాయి. సేకరించిన భూముల్లో వెంచర్లు ఏర్పాటుచేసి అత్యాధునిక హంగులతో 6.40 లక్షల గృహాలను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా బహుళ అంతస్తులతో అపార్ట్‌మెంట్ల నిర్మాణం, అత్యాధునిక హంగులతో విల్లాలను నిర్మించనున్నారు. తద్వారా అన్నదాతల భూములకు ధరలు పెరుగనుండడంతో ఇప్పటికే 2,620 ఎకరాల భూములను రైతులు హెచ్ఎండీఏకు ఇచ్చేందుకు ముందుకొచ్చినట్లు తెలిసింది. భూసేకరణకు సంబంధించి ఏప్రిల్ మాసంలోనే అధికారులు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. బృహత్ కారిడార్ ఏర్పాటుతో ఇబ్రహీంపట్నం రానున్న పదేండ్ల కాలంలో ఉహించిన రీతిలో ప్రగతి సాధించనున్నది. ఇప్పటికే ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో టీసీఎస్, ఏరోస్పేస్ వంటి అతిపెద్ద పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఔటర్‌రింగ్‌రోడ్డు చుట్టూ పెద్ద ఎత్తున బహుళ అంతస్తులతో పాటు విల్లాలూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో హెచ్ఎండీఏ అధికారులు ఈ ప్రాంత అభివృద్ధిపై మరింత దృష్టి సారించారు.



బృహత్ కారిడార్ ముఖచిత్రం


చర్లపటేల్‌గూడ గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

### దండుమైలారంలోనూ భూసేకరణ..

అలాగే, ఇబ్రహీంపట్నం మండలంలోని దండుమైలారం గ్రామంలోనూ పెద్దఎత్తున ఆటస్థలాలను ఏర్పాటు చేయాలని హెచ్ఎండీఏ నిర్ణయించింది. సుమారు ఐదువేల ఎకరాల్లో సిగ్నేల్యాండ్స్ పేరుతో భూమిని సేకరిస్తున్నారు. అందులో పిల్లల ఆట స్థలాలతోపాటు అనేక రకాల పార్కులను అభివృద్ధి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

## కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలి

**మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి**

పరిగి టౌన్, మే 7 : బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి సబితారెడ్డి ఓటర్లను కోరారు. మంగళవారం పరిగిలోని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బీజేపీకి ఓటు అడిగే హక్కు లేదన్నారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని పలుమార్లు కోరినా పట్టించుకోలేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రోడ్డు షోకు జనాలు ఊహించినదానికంటే ఎక్కువగా వస్తున్నారన్నారు. ఓటర్లకు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో స్వామిగౌడ్, కాసాని జ్ఞానేశ్వర్, ఎంపీపీ అరవింద్‌రావు, నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సురేందర్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ అశోక్ పాల్గొన్నారు.

ఈవీఎం మిషన్లను పరిశీలిస్తున్న రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి

## పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

- రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి
- ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, మేరీనాట్ పాఠశాలలో నిర్వహిస్తున్న కమిషనింగ్, ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పరిశీలన

వికారాబాద్, మే 7 : పోలింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావీయకుండా సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం పార్లమెంటరీ ఎన్నికల నేపథ్యంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతిలతో కలిసి ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, మేరీనాట్ పాఠశాలలో నిర్వహిస్తున్న కమిషనింగ్, ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 13న జరిగే పోలింగ్‌కు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ విధులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా అవసరం మేరకు అదనంగా సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లతోపాటు అదనంగా ఎన్నికల సామగ్రి ఉన్నందున కూలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లను సందర్శించి ఫెసిలిటేషన్ కేంద్రంలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికీ పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయనివారికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలని అధికారులకు సూచించారు. ముందుగా చేవెళ్ల పార్లమెంటరీ రిటర్నింగ్ అధికారి శశాంక్‌కు వికారాబాద్ కలెక్టరేట్‌లో వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, జడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్డీఓ శ్రీనివాస్ స్వాగతించారు. కార్యక్రమంలో వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఫెసిలిటేషన్ కేంద్రం నోడల్ అధికారి సాజిదాబేగం, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

### పొరపాట్లు జరుగకుండా చూడాలి

తాండూరు/పరిగిటౌన్ : ఎన్నికల్లో ఎక్కడ పొరపాట్లు జరుగకుండా చూడాలని రంగారెడ్డి కలెక్టర్, రిటర్నింగ్ అధికారి శశాంక అధికారులను ఆదేశించారు. ఆయన వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి పరిగిలోని నం.2 ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పని తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే తాండూరు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు, ఫెసిలిటేషన్ కేంద్రంలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని పరిశీలించారు. తాండూరు పట్టణంలోని సాయిపూర్ ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంతో పాటు సెయింట్‌మార్క్ ఇంటర్ నేషనల్ స్కూల్‌లోని స్ట్రాంగ్ రూంను తనిఖీ చేశారు. ఈవీఎంల ప్రక్రియ నిర్వహణను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్, డబుల్ ఓట్ల వివరాలు, ఓటర్ స్లిప్‌ల పంపిణీ తదితర వివరాలను కలెక్టర్లు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాండూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ తారాసింగ్, పరిగి నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావు పాల్గొన్నారు.

### జీహెచ్ఎంసీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో అమలు చేస్తున్న పథకాలను అధ్యయనం చేయడానికి వచ్చిన ట్రైనీ ఐఏఎస్‌లకు పథకాల అమలు తీరును జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ వివరించారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం హాల్‌లో సమావేశం నిర్వహించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జీహెచ్ఎంసీ అమలు చేస్తున్న వివిధ పథకాలతో పాటు సంబంధించిన డెమోగ్రఫీ, శానిటేషన్, చెత్త సేకరణ, డిస్పోజల్, సి అండ్ డి అడ్మినిస్ట్రేషన్, ప్రాపర్టీ ట్యాక్స్ తదితర పథకాలను తెలిపారు. సమావేశంలో ఈఎన్‌సీ జియా ఉద్దీన్, సీఈ దేవానంద్, కిషన్, అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, గీతా రాధిక, సునంద, ట్రైనీ ఐఏఎస్‌లు ఉమా శంకర్, అమిత్, కిరణ్మయి, శారద శుక్ల, యువరాజ్, మాయక్, వికాస్ ఉన్నారు.

### 8 నుంచి మొక్కజొన్న పరిశోధనా సంస్థల సదస్సు

వ్యవసాయ యూనివర్సిటీ, మే 7 : తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే అవకాశం ఉన్న మొక్కజొన్నకు దేశవ్యాప్తంగా అధిక ప్రాధాన్యత ఉంటుందని వర్సిటీ పరిశోధనా సంస్థ సంచాలకులు రఘురామిరెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఈ నెల 8న మొక్కజొన్న పరిశోధనా సంస్థల సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సదస్సులో భారత వ్యవసాయ పరిశోధనా మండలి అధికారులు 180 మంది, అఖిల భారత మొక్కజొన్న శాస్త్రవేత్తలు 120 మంది, ప్రైవేటు సంస్థల అధిపతులు, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

### నీటి నాణ్యతలో రాజీ పడొద్దు

సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ): జలమండలి అధికారులు సమస్యాత్మక ప్రాంతాల్లో రోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఎం.డీ. సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎండి సుదర్శన్‌రెడ్డి మంగళవారం జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో తాగునీటి సరఫరా, ట్యాంకర్ మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ఎంసీసీ ఫిర్యాదులు, చలివేంద్రాల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా ట్రిప్పుల సంఖ్య పెంచాలని సూచించారు. కింది స్థాయి సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకోవాలని, క్వాలిటీ వింగ్ అధికారులు నీటి నాణ్యతలో రాజీ పడకూడదన్నారు. తగిన మోతాదులో క్లోరిన్ శాతం ఉండేలా చూడాలన్నారు. వర్షాకాల ప్రణాళిక కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్మికులు, సిబ్బంది ఇచ్చే రక్షణ పరికరాలు సరిపడా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్యలు రాకుండా, సీవరేజ్ జెట్టింగ్ మిషన్లు ఉపయోగించుకోవాలన్నారు. సమీక్షా సమావేశంలో డైరెక్టర్ ఆపరేషన్స్ అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, సీజీఎంలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించగలం

**'కాసాని'కి ఓటు.. బీసీల విజయానికి తొలిమెట్టు**

**బీసీల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాన్ని నిజం చేద్దామంటున్న బీసీ సంఘాలు**

కాంగ్రెస్‌కు విభజించడం, పాలించడం అలవాటైందని బీసీ సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే బీసీలు అణచివేతతోపాటు అభివృద్ధిలో వెనుకబాటుకు గురవుతామని హెచ్చరిస్తున్నారు. బీసీకి చెందిన వ్యక్తి పార్లమెంటులో ఉంటేనే నిధులు, విధుల గురించి పోరాటం చేసే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఇప్పటివరకు రాని అవకాశం చేవెళ్లలో బీసీలకు వచ్చిందని, బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందామని స్పష్టం చేస్తున్నారు. బీసీల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాన్ని కాసాని గెలుపుతోనే నిజం చేద్దామని పిలుపునిస్తున్నారు. కాసానికి వేసే ప్రతి ఓటు బీసీల విజయానికి తొలిమెట్టుగా భావించాలని, కాసాని గెలిస్తే పార్లమెంటులో బీసీల ప్రాతినిధ్యం కూడా పెరుగుతుందని వివరిస్తున్నారు. బీసీల్లోని అన్ని కులాలు ఏకతాటిపైకి రావాలని, బీసీల పట్ల చులకన భావంతో మాట్లాడుతున్న నేతల నోళ్లకు చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల ఫలితంతో తాళం వేయాలని కోరుతున్నారు. **రంగారెడ్డి, మే 7 (నమస్తే తెలంగాణ)**

**అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒదులుకోం**

మన బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు బీఆర్ఎస్ అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒదులుకోం. అగ్రవర్గాల రాజకీయ నాయకులను గతంలో గెలిపించుకుంటే వారి వల్ల బీసీలకు ఎలాంటి లాభం జరుగలేదు. కాసానికి ఓటు వేసి భారీ మెజార్టీ అందించి బీసీల సత్తా చాటుదాం. బీసీ నేతను గెలిపించుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రావు.

**- గొల్ల గోరెప్ప, హాజీపూర్, యాలాల మండలం**

**చేవెళ్ల గడ్డపై బీసీల ఐక్యత చాటుతాం**

మన బీసీల గొంతుకను లోక్‌సభలో వినిపిద్దాం. ఈ గొప్ప అవకాశాన్ని చేజార్చుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. బీసీలకు బీఆర్ఎస్ అవకాశం కల్పించింది. బీసీలు ఏకం కావాల్సిన సమయం వచ్చింది. బీసీ అభ్యర్థిని గెలిపించుకుంటేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. రాజకీయాలను అందరం పక్కన పెట్టి పార్టీల కతీతంగా కాసాని గెలుపునకు కృషి చేద్దాం.

**- ఈడిగి నర్సింహులు, హాజీపూర్, యాలాల మండలం**

**బీసీ నేతను గెలిపించుకుందాం**

బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మంచి పట్టున్న నేత. జడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీగా పనిచేసిన నాయకుడు కాసానికి బీఆర్ఎస్ అధినేత చేవెళ్ల ఎంపీ టికెట్ కేటాయించడం గొప్ప పరిణామం. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలందరం ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**- శేరిగూడెం వెంకటయ్య, నాగరకుంట(షాబాద్)**

**బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి**

చేవెళ్ల గడ్డపై ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా ఎగురవేసేందుకు అందరూ కృషి చేయాలి. గతంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీలుగా గెలిచిన ఇద్దరు నాయకులు సొంత ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీజేపీల్లో చేరారు. బీసీ నేత కాసానికి ఎంపీ అభ్యర్థిగా కేసీఆర్ అవకాశం కల్పించారు. బీసీ సోదరులంతా ఒకసారి ఆలోచించి, జ్ఞానేశ్వర్‌ను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**- సాయికిరణ్‌గౌడ్, చందనవెల్లి(షాబాద్)**

**పేదలు, ఉన్నతులకు మధ్య యుద్ధం**

సమాజంలో నెలకొన్న అసమానతలు పూర్తిగా సమసిపోవాలని పోరాడుతున్నా. ఇంకా కొందరు వాటిని కొనసాగించి రాజకీయ లాభం పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. జనాభాలో తగు సంఖ్య ఉన్నప్పటికీ ఇప్పటికీ బీసీ వర్గాలు ప్రధానంగా రాజకీయంగా వెనుకబాటులోనే ఉంటున్నారు. ఈ వర్గాన్ని గుర్తించి చేవెళ్ల ఎంపీ స్థానాన్ని బీసీ బిడ్డకు ఇచ్చి కేసీఆర్ వారి పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్నారు.

**- పద్మ ముదిరాజ్, ఎల్లమ్మబండ**

**నిలబడతాం.. నిలబెట్టుకుంటాం..**

ఏండ్ల తరబడి రాజకీయ నేతలకు ఓటు బ్యాంకుగానే తప్ప వెనుకబడిన వర్గాలు వారి కంటికి కనబడే పరిస్థితి లేదు. అందుకు మా వర్గానికి చెందిన కాసానికి చేవెళ్ల ఎంపీ స్థానాన్ని ఇచ్చిన బీఆర్ఎస్‌కు మేం కృతజ్ఞతలు తెలుపుతున్నాం. బీసీ బిడ్డలంతా ఈ ఎన్నికల్లో ఐక్యంగా నిలబడమే కాకుండా మా అభ్యర్థిని విజయ తీరాలపై నిలబెట్టుకుంటాం. **- వెన్నెల ముబిరాజ్, ప్రశాంత్‌నగర్**

**బీసీలంతా ఏకతాటిపైకి రావాలి**

బీసీలు చైతన్యం చాటే సమయం అసన్నమైంది. ఓట్లు మావే, గెలుపు మనదే. రాష్ట్రంలో 96 కులాలను ఏకతాటిపైకి తెచ్చిన నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్. బీసీల గళం పార్లమెంట్‌లో వినిపించాలంటే జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాల్సిన అవసరమున్నది. కాంగ్రెస్ శ్రేణులు అహంకారపూరితంగా చేస్తున్న వ్యాఖ్యలకు మన ఐక్యతే చెంపపెట్టు కావాలి. **- పబ్బు శేఖర్**

**కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం**

బీఆర్ఎస్ నాయకులు పోటీ చేస్తున్న ప్రతి చోట పార్టీలకు అతీతంగా వారిని గెలిపించుకుందాం. బీసీలను అవమానపర్చేలా మాట్లాడుతున్న అగ్రవర్గ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలి. బీసీలోని 96 కులాలు ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారం వైపు నడవాలి. మన ఓట్లు మనకే అనే నినాదంతో ముందుకెళ్లాలి. జ్ఞానేశ్వర్‌కు కేసీఆర్ టికెట్ ఇవ్వడం సంతోషించదగ్గ విషయం.

**- కానుగుల బాలుశ్రీ**

**బీసీ అభ్యర్థిని గెలిపించుకుందాం**

ఏన్నో ఏండ్లుగా బీసీలను ఓట్లు కాసే చెట్లుగా మార్చుకున్నారు తప్ప బీసీలకు ఒక్క అవకాశం కూడా ఇవ్వలేదు. ఇప్పుడు బీసీల్లో చైతన్యం వచ్చింది. మన ఓట్లు మనమే వేసుకుందాం. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే కాసాని ఎంపీగా గెలవాల్సిందే. కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీలను చిన్నచూపు చూస్తే ఊరుకునే దిలేదు.

**- శ్రీనివాస్, మోమిన్‌కలాన్, ధారూరు మండలం**

**బీసీ బిడ్డను పార్లమెంటుకు పంపిద్దాం**

తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకుడు, బీఆర్ఎస్ పార్టీ బలపరచిన చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్లమెంటుకు పంపిద్దాం. అగ్రవర్గాలు బడుగు బలహీన వర్గాలను అణగదొక్కుతూ రాజకీయాల్లో అవకాశం కల్పించడంలేదు. బీసీల ఓట్లతో ఎంతో మంది రాజ్యాధికారం చేపట్టారు. బరిలో నిలుచున్న జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం. **- పెంటయ్య, మోమిన్‌కలాన్, ధారూరు మండలం**

**చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం**

బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషిచేసిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను అఖండ మెజార్టీతో చేవెళ్ల గడ్డపై గెలిపించుకుంటాం. ఇన్నాళ్లు అగ్రవర్గాలకు చెందిన నాయకులకే అన్ని రాజకీయ పార్టీలు టికెట్‌ను కేటాయించి బీసీలను బానిసల్లా అణగదొక్కారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో మొదటిసారి బీసీ నేత జ్ఞానేశ్వర్‌కు టికెట్ ఇచ్చారు.

**-షేక్ ముక్తార్ పాషా**

**సవాల్‌గా తీసుకోవాలి**

బీసీల ఐక్యతకు చేవెళ్ల పార్లమెంటు సీటును ఓ సవాల్‌గా ప్రతి బీసీ నాయకుడు, ప్రజలు తీసుకోవాలి. అందరూ కలిసికట్టుగా మన ఐక్యతను చాటుకుని ఓ బీసీ నేతను పార్లమెంటుకు పంపితే మన సమస్యలపై అక్కడ గొంతెత్తే అవకాశం ఉంటుంది. అన్ని రాజకీయ పార్టీల నాయకులు సైతం అంతర్గతంగా ఆలోచించి కాసానిని గెలిపించుకునేందుకు ఏకతాటిపైకి రావాలి.

**- బుద్ధోలు శ్రీరాములు కురుమ, మణికొండ**

**కాసానికి అవకాశం కల్పించడం సరైనదే.**

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడే కాసాని జ్ఞానేశ్వర్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. 30 సంవత్సరాల క్రితం 96 కులాలను ఏకంచేసి రాజకీయ చైతన్యం కల్పించారు. కాసాని చైర్మన్‌గా ఉండి వేసిన ఫార్మేషన్ రోడ్లు నేటికీ ఈ ప్రాంతంలో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం చేవెళ్ల ఎంపీ స్థానానికి కాసానికి కేసీఆర్ అవకాశం కల్పించడం సరైనదే.

**- సతీష్, పూడూరు**

**బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరు**

బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయింది. ప్రస్తుతం రైతులు, యువకులు, వృద్ధులు కాంగ్రెస్, బీజేపీలను నమ్మడం లేదు. గతంలో బీసీలకు న్యాయం చేయాలనే సంకల్పంతో పేదల సంక్షేమమే ధ్యేయంగా జ్ఞానేశ్వర్ పనిచేశారు. కాసాని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే మంచి పేరున్న నాయకుడు.

**- మధుసూదన్, పూడూరు**

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

## బీఆర్ఎస్ అంటే భరోసా.. సంక్షేమం

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిన పలువురు నాయకులు

కొడంగల్, మే 7 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా విధానాలు నచ్చక మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, గుర్రం మల్లప్ప, ఎండీ అజీమ్ మౌలానా, శ్రీనివాస్ తదితరులు పేర్కొన్న